క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

కూసుమంచి: కూసుమంచి మండల ఫెర్టిలైజర్స్ దుకాణాల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఇంటూరి నారాయణ, కార్యదర్శిగా ముల్కూరు శ్యాం సుందర్‌రెడ్డి, జిల్లా ఈసీ కమిటీ సభ్యులుగా ఎండీ రంజాన్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు బండ్ల సోమిరెడ్డి, ఇందుర్తి వెంకటరెడ్డి, తిరుపతిరావు, శ్రీనివాస్‌రెడ్డి, కన్నయ్య, హరీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత

ఖమ్మం సహకారనగర్: ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన అడారి వినయ్‌కి రూ.20వేల చెక్కును అందించినట్లు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థినికి చెక్కు అందించాక మాట్లాడుతూ.. వినయ్ కోల్‌కత్తాలో నీట్ తృతీయ సంవత్సరం చదివేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ ఝాన్సీకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఖమ్మం సహకారనగర్: తమ కళాశాల డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ధరావత్ మల్సూర్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు గాయత్రి డిగ్రీ కళాశాల యాజమాన్యం కుటుంబరావు, ప్రిన్సిపాల్ సునీల్‌రావులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల గోవాలో 18వ నేషనల్ యూత్‌స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగిన కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి పాల్గొని మల్సూర్ ప్రతిభ కనబర్చారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో డిప్లొమా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డిప్లొమా ఇన్‌చార్జ్ జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల యోధుడు చంద్రశేఖర్

తిరుమలాయపాలెం: పేద ప్రజల తరఫున అనేక పోరాటాలు చేసిన రాయల వెంకటనారాయణ స్ఫూర్తితో ఉద్యమ బాట పట్టిన రాయల చంద్రశేఖర్ మృతి తీరని లోటని మాస్‌లైన్ నాయకుడు రేపాకుల శివలింగం అన్నారు. మండలంలోని పిండిప్రోలులో శుక్రవారం నిర్వహించిన చంద్రశేఖర్ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ..రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య చేసుకుంటే మనోధైర్యం కల్పించిన చంద్రశేఖర్ మరణం విప్లవోద్యమానికి నష్టదాయకమని పేర్కొన్నారు. కాగా, ఈనెల 28న ఖమ్మంలో జరిగే సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, రాయల రవికుమార్, తిమ్మిడి హన్మంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులిగుజ్జు వెంకటస్వామి, బానోతు శంకర్, ఆరెంపల వెంకన్న, గొడుగు విజయ్, రాయిండ్ల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన శ్రీనివాస్

కూసుమంచి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని జిల్లా కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు, రైతుల పంట రుణాల మాఫీ తదితర అంశాలపై ఇన్‌చార్జ్‌తో చర్చించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

సన్మానం



ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ

కూసుమంచి: కూసుమంచిలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన కోటేశ్వరరావు, శ్రీనివాసాచారి, విజయలక్ష్మిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బీవీ రామాచారి మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఇందులో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. అనంతరం బదిలీ ఉపాధ్యాయులు విద్యార్థులకు గుర్తుగా పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రేల విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విజయకుమారి, స్వరూప, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా సంత.. ట్రాఫిక్‌తో చింత!

సంతలతో ట్రా'ఫికర్'

- రహదారి వెంబడే నిర్వహణ
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు
- ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో సమస్య
- పండితాపురంలో నిరుపయోగంగా దుకాణాల సముదాయం
- పట్టించుకోని పాలకులు

మండలాల్లో నిర్వహించే వారాంతపు సంతల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏటా వేలం ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తున్నా.. వసతులు మాత్రం సమకూరడం లేదు. అమ్మకందారులు, కొనుగోలుదారులు ఎండకాలంలో ఎండుతూ, వానకాలంలో తడుస్తున్నా పంచాయతీలు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రధానంగా కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెంలతో పాటు కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) సంతల్లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రత్యేక స్థలాలు కేటాయించకపోవడంతో రహదారి వెంబడి వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రాష్ట్రంలోనే అతి పెద్ద సంతల్లో ఒకటిగా పండితాపురం నిలుస్తున్నా పరిస్థితులు మారడం లేదు.

– కూసుమంచి/కామేపల్లి



పండితాపురంలో ప్రధాన రహదారి పక్కనే జీవాల క్రయవిక్రయాలు జరుపుతున్న వ్యాపారులు,రైతులు

పండితాపురంలో అమ్మకాల జోరు..

కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ పంచాయతీలో ప్రతీ బుధవారం వారంతపు సంత జరుగుతుంది. ఇక్కడి ప్రజలతో పాటు హైదరాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వరంగల్, ఆంధ్రాలోని పలు జిల్లాల నుంచి వ్యాపారులు, రైతులు వస్తారు. దీంతో గతేడాది అంగిడి ద్వారా రూ.2 కోట్లకు పైగా జీపీకి ఆదాయం సమకూరింది. కానీ ఇక్కడ షెడ్లు ఉన్నప్పటికీ వాటిని ప్రారంభించకపోవడంతో ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి పక్కనే అమ్మకాలు చేపడుతున్నారు. ఈ సంతలో కూరగాయలు, పలు రకాల వస్తువులతో పాటు మూగ జీవాలను(సుమారు 1000కి పైగా) విక్రయించేందుకు ఆటోల ద్వారా తరలించడంతో అటు జీవాలు, ఇటు ఆటోలు, వ్యాపారులు, రైతులతో సంత ఆవరణం కిక్కిరిసిపోతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా.. పోలీసులు మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

కూసుమంచిలో..



కూసుమంచిలో విక్రయాలు ఇలా..

కూసుమంచిలో ప్రతీ సోమవారం నిర్వహించే సంతలో కూరగాయలు ఎక్కువగా విక్రయిస్తుంటారు. ఇక్కడకు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో జనాలు వందల సంఖ్యలో వస్తుండడంతో ఆ వాహనాలను నిలిపేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పోచారం వెళ్లే రహదారి వెంట విక్రయాలు సాగిస్తుండడంతో వాహనాలు కూసుమంచి గ్రామంలోకి వెళ్లాలన్నా, కిష్టాపురం, పోచారం గ్రామాలకు రాకపోకలు సాగించాలన్నా కష్టతరమే. అంతేకాక పాఠశాలల బస్సులు, ట్రాక్టర్లు, లారీలు ఈ దారిలో వెళ్లాల్సి ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇక ట్రాఫిక్‌కు అంతరాయమే. ఖమ్మం–సూర్యాపేట రాష్ట్రీయ రహదారిని దాటి రావాల్సి ఉన్నందున ప్రమాదాలూ జరిగే అవకాశం ఉంది.

పాలేరులో..

పాలేరులో ప్రతీ శుక్రవారం జరిగే ఈ సంతలో ముఖ్యంగా పశువులు, మేకల క్రయ విక్రయాలతో పాటు కూరగాయలు, ఇతర వస్తువుల విక్రయాలు ఎక్కువగా విక్రయిస్తుంటారు. పశువులు, గొర్రెల, మేకల విక్రయాలకు స్థలం ఉన్నా.. అది సరిపడా లేదు. ఇక కూరగాయలు, ఇతర వస్తువుల విక్రయాలకు స్థలం లేదు. దీంతో ప్రతీ వారం రహదారుల వెంట వ్యాపారాలు సాగిస్తుండగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

నాయకన్‌గూడెంలో..

మండలంలోని నాయకన్‌గూడెంలో ప్రతీ బుధవారం జరిగే సంతను రాజుపేటరోడ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సంతకు నాయకన్‌గూడెం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సమీప సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రజలు వస్తుండడంతో రద్దీ నెలకొని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ సంతలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు తొలగడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి. పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఈ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

8 ఏళ్లుగా నిరుపయోగం..



ప్రారంభం కాని దుకాణాల సముదాయం

8 ఏళ్ల క్రితం వ్యాపారులు, రైతులు పండితాపురం సంతలో విక్రయాలు జరిపేందుకు నిర్మించిన సుమారు 10 దుకాణాల సముదాయాలు నేటికి ప్రారంభం కాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వేలంతో పాటు సంతలో వ్యాపారుల నుంచి రుసుం వసూళ్లు చేస్తుండగా.. ఏడాదికి రూ.2 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. అయినా వ్యాపారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై జీపీ అధికారులు విఫలం చెందారని వ్యాపారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ లేకుండా చర్యలు..



సంతకు ఉదయం జీవాలు, పశువులు ఆటోల్లో ఒకేసారి రావడం, వెళ్లడంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ప్రతీ వారం పోలీస్ సిబ్బంది అక్కడే ఉండేలా చూస్తున్నాం. రహదారి వెంట అమ్మకాలు జరగకుండా సంత ఆవరణలోనే జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్సై ప్రవీణ్‌కుమార్,ఎస్సై కామేపల్లి

సమస్యలు పరిష్కరించాలి..



సంత రోజు కూసుమంచి హైస్కూల్ నుంచి పోచారం వెళ్లే దారిలో రద్దీగా ఉంటుంది. ఈ ఇరుకు రహదారిలో కనీసం నడవటం కూడా కష్టమే. ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండడం లేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

– ఉపేందర్, కూసుమంచి

ఇబ్బందిగా ఉంటుంది..



కూసుమంచిలో సంత రోజున మా దుకాణాల ముందే వ్యాపారులు కూర్చొని కూరగాయలు అమ్ముతుంటారు. మా దుకాణాలకు వచ్చే వారికి దారి మూసుకుపోయి అసౌకర్యం కలుగుతుంది. ఈ సమస్యను వెంటనే తీర్చాలి.

– యాకూబ్, ఆటోమొబైల్స్ దుకాణం

పోస్టర్లు ఆవిష్కరణ

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో రఘునాథపాలెం మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందిన పోస్టర్లను శుక్రవారం అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 26, 27, 28వ తేదీల్లో ఎల్బీనగర్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో జరిగే హైదరాబాద్ ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను వైస్ ప్రెసిడెంట్ వాంకుడోత్ జగదీష్ అధ్యక్షతన ఆవిష్కరించగా.. మండల మాజీ అధ్యక్షుడు భూక్య బాలాజీ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్యా భాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. యాసీన్, ట్రెజరర్ గుగులోత్ మంగీలాల్, గౌరవ అధ్యక్షుడు జూకంటి భద్రయ్య, సలహాదారులు సచ్చు వీరబాబుతో పాటు ఆడెపు హనుమంతరావు, సంగయ్య, కేలోత్ రామకృష్ణ, ఆవుల మధు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మంగీలాల్

తిరుమలాయపాలెం: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ఎంపీపీ బోడ మంగీలాల్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలుశాఖల అభివృద్ధి, ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా పైపు లీకేజీ ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు రుణమాఫీ అందే విధంగా ఏఈఓలు క్లస్టర్ల వారీగా పనిచేస్తారని, రైతులు తమ సందేహాలను ఏఈఓల ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అనంతరం రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీటీసీలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషాద్రి తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సాయినాథుడి శోభాయాత్ర



శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నగరంలోని గాంధీచౌక్ శ్రీ వరప్రదాత షిర్డీ సాయిబాబా మందిరం నుంచి నిర్వహించిన సాయినాథుడి శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. బాబాను పూలమాలలతో సర్వంగా సుందరంగా అలంకరించి మహిళల బృందం కోలాటాల నడుమ భిన్నమైన రూపలతో ప్రదర్శన చేస్తూ.. మేళతాళాలతో సాయినాథుడి ఊరేగించారు. మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్‌ల ఆధ్వర్యన నిర్వహించిన ఈ ఉత్సవంలో బాబా మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ఉపాధి'ని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంగయ్య

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ కూలీలపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పి.సంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిని దూరం చేయాలని చేస్తే సహించేది లేదని, కూలీల తరఫున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అదే విధంగా ఈనెల 24న కాచిరాజుగూడెంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, బుద్ధి ప్రసాద్, వి.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణ, కర్లపూడి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

'గారడీ మాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వం'

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ మాటలతో ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో యింజం నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టాదారు పాస్ పుస్తకం ద్వారా రుణాలు తీసుకున్న రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు పాత డిజైన్ ప్రకారమే కాల్వను కొనసాగించాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు దుగ్గి కృష్ణ, అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీనివాస్, ఆరెం లక్ష్మి, ఆడప ఉపేందర్, కిన్నెర రామచంద్రయ్య, గుండా వెంకటరెడ్డి, హుస్సేన్, రాంబాబు, అజ్మీరా నవీన్, రామకృష్ణ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మోసం చేస్తుందని బీజేపీ తమిళనాడు సహా ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏ షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు ఆంక్షలు విధించడం వలన చాలా మంది నష్టపోవాల్సి వస్తుందన్నారు. అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడగా.. తాండ్ర వినోద్‌రావు, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ జీవీఆర్, సన్నె ఉదయ్‌ప్రతాప్, వాసుదేవరావు, ఈ.వీ.రమేష్, అరుణ, విజయరెడ్డి, అనిత, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి పనులు వెంటనే ప్రారంభించాలి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల ఆస్పత్రి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన శుక్రవారం ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.26 కోట్లతో 100 పడకల ఆస్పత్రిగా తిరుమలాయపాలెం ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసిందని, నాటి నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కానీ ఇప్పుడు వంద పడకల ఆస్పత్రిని కూసుమంచికి తరలించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకొని అప్‌గ్రేడ్ పనులు ప్రారంభించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీలు అందరినీ ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని, దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నాగేశ్వరరావు, మట్టి దుర్గాప్రసాద్, వెంకన్న, కొలిచలం స్వామి, బి.రాములు, వెంకన్న, వెంకటేష్, ఉప్పలయ్య, పి.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కథా, కవితలపై అవగాహన

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కథ, కవితలపై అక్షరాల తోవ సాహితీ సంస్థ కార్యశాలను నిర్వహించింది. రచనలు చేయడం ఎలా? కథా రచనలో వస్తువు సేకరణ, కథనం, మలుపు, ముగింపు వంటి అంశాలపై సాహితీ సంస్థ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జానకి, బాల సాహితీవేత్త, ఉపాధాయుడు సయ్యద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన ఖమ్మం మున్నేరు పరీవాహక ప్రాంతాలను శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. వరద వచ్చినప్పుడు ఏఏ ప్రాంతాలు మునుగుతాయి, ప్రమాద హెచ్చరికలు ఎప్పుడు జారీ చేస్తారనేది అడిగి తెలుసుకున్నారు. వాటర్ లెవల్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వచ్చిన పక్షంలో పునరావాస కేంద్రాల కోసం వసతిగృహాలను పరిశీలించారు.

అప్రమత్తత అవసరం

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాల నేపథ్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ బీఆర్‌ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వరరావు సూచించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలియజేయాలని, అందుకు అధికారులూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించి భోజన సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ రహదారులపై బురద తొలగింపు

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో వర్షాలకు సీసీ రహదారులపై బురద పేరుకుపోవడంతో శుక్రవారం తొలగించారు. గ్రామంలో గతంలో వేసిన సీసీ రోడ్లు లోతట్టుప్రాంతంలో ఉండడంతో వర్షం వచ్చినప్పుడు బురదపేరుకుపోయి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మంకెన వాసు ఆధ్వర్యాన రోడ్లపై బురద తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

ఓట్లు వేయలేదని కక్ష సాధింపు చర్య

ఖమ్మంమయూరిసెంటర్: ముస్లిం మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బ తీయాలని బీజేపీ ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోందని, ఎన్నికల్లో మైనార్టీలు ఓట్లు వేయలేదని కక్ష సాధింపుగా మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జామామస్జీద్‌ను నేలమట్టం చేశారని సీపీఐ నాయకుడు మహమ్మద్ సలాం అన్నారు. శుక్రవారం వాహిదియా మస్జీద్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఇండియా కూటమి లేవనెత్తాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అవాజ్ గౌస్, ఎండీ రెహమాన్, టజు మీరా, అహ్మద్, ఎండీ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం



కామేపల్లి: ట్రాక్టర్‌పై ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే కోరం



నేలకొండపల్లి: చెన్నారంలో పాలాభిషేకం..

కామేపల్లి/ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి/రఘునాథపాలెం: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు మానుకొండ వెంకటేశ్వరరావు అన్నారు. రైతు రుణమాఫీ అమలును పురస్కరించుకుని శుక్రవారం పలు మండలాల్లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి బాణాసంచాలు పేల్చారు. ఈమేరకు కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి రైతు వేదికలో ఎమ్మెల్యే కోరం, ఖమ్మం వ్యవసాయ మార్కెట్, రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో పువ్వాళ్ల, నేలకొండపల్లి మండలం చెన్నారంలో మానుకొండలు సంబరాలు నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఇకనైనా ప్రతిపక్షాలు విమర్శలు చేయటం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ బానోత్ సునీత, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, తహసీల్దార్ సుధాకర్, ఏఓ భూక్యా తారాదేవి, నల్లమల వెంకటేశ్వరరావు, మహ్మద్ జావీద్, మానుకొండ రాధాకిషోర్, గుత్తా వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు జగన్, కొప్పెర ఉపేందర్, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, నున్నా మాధవరావు, తల్లాడ రమేష్, దిరిశాల వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్, నలమోతు లక్ష్మయ్య, బాణాల లక్ష్మణ్, ఎంపీటీసీ లకావత్ సునీత ,నల్లమోతు లక్ష్మయ్య, గుగులోత్ గగ్రూనాయక్, సుల్తాన్ వీరబాబు, వి.నాగేశ్వరరావు, చింతనిప్పు సైదులు, మంకెన వెంకటేశ్వరరావు, చిమ్మపుడి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జొనెబోయిన పాపయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు జోనేబోయిన పాపయ్య, జిల్లా కిసాన్ ఉపాధ్యక్షుడు కోటేర్ నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో రూ.7.72 కోట్ల మాఫీ

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీలో భాగంగా నేలకొండపల్లి డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో 2,647 మంది రైతులకు రూ.7.72 కోట్లు వర్తించినట్లు బ్రాంచి మేనేజర్ టి.ఇందు తెలిపారు. మండల కేంద్రంలోని బ్రాంచ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఇందులో సొసైటీల వారీగా మాఫీ అయిన వివరాలిలా ఉన్నాయి.

సొసైటీ	రైతులు	రుణమాఫీ
బోదులబండ	258	రూ.83,53,316
చెన్నారం	106	రూ.39,42,779
మంగ్రాజుపల్లి	113	రూ.53, 08,116
నాచేపల్లి	225	రూ.66,29,352
నేలకొండపల్లి	808	రూ.1,65,69,090
పైనంపల్లి	229	రూ.89,05,754
రాజారాంపేట	493	రూ.1,52,08,277
రాజేశ్వరపురం	279	రూ.66,32,225
రామచంద్రాపురం	134	రూ.54,89,679

● బస్టాండ్ ఆవరణలోకి వరద

గత కొద్ది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి నగరంలోని పాత బస్టాండ్ ఆవరణలోకి శుక్రవారం నీరు చేరింది. దీంతో ఆవరణమంతా మోకాళ్ల లోతు వరకు ఉండడంతో బస్టాండ్‌లోని ప్రయాణికులు బస్ ఎక్కేందుకు ఆ నీటిలో నడవలేక తీవ్ర అవస్థలు పడ్డారు.

– ఖమ్మంమయూరిసెంటర్



